


ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

తహశీల్దార్‌కు కాలనీ వాసుల వినతి



వినతిని అందజేస్తున్న స్థానికులు

బుట్టాయగూడెం : పేదల ఇళ్లపై 11 కెవి విద్యుత్ వైర్లు తగలడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. సోమవారం మండల తహశీల్దార్‌కి కెవిపిఎస్ ఆధ్వర్యాన రాజీవ్ నగర్ కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ రాజీవ్ నగర్ కాలనీలో 40 సంవత్సరాల క్రితం ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. దళితులు, పేదలు నివసిస్తున్నారని, వారి ఇళ్లపై నుండి 11 కెవి విద్యుత్తు లైను వెళ్లటం వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. త్వరితగతిన తొలగించాలన్నారు. తహశీల్దార్ సంబంధిత అధికారులకు, విద్యుత్ అధికారులకు సమస్యను తెలియపరుస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కె.రమేష్, ఎం.అశోక్, ఎ.అశోక్ పాల్గొన్నారు.

సమస్యలు చెబుతాం.. పరిష్కారం కావు..!

డిఆర్‌సి సమావేశంలో ఎంఎల్‌ఎలు అసహనం
వ్యవసాయంతోపాటు పలు అంశాలపై చర్చ
పలు సమస్యలు లేవనెత్తిన ఎంఎల్‌ఎలు, మంత్రి పార్థసారథి
ఫారెస్ట్ అధికారుల తీరుపై ఎంఎల్‌ఎలంతా తీవ్ర అసహనం
రైతాంగ సమస్యలపై రాజీపడం: ఇన్‌ఛార్జి మంత్రి మనోహర్



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'కొబ్బరి మొక్కలపై నర్సరీల దురాగతాలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోరు.. మొక్కజొన్న రైతులను విత్తన కంపెనీలు మోసగిస్తున్నాయని చెప్పినా చర్యలు తీసుకోరు. ఆర్‌ఎఫ్‌ఒ పట్టాలిచ్చి బోర్లకు అనుమతివ్వకపోవడంపై అడిగినా చలించరు. కొల్లేరులో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుల గురించి పదేపదే చెబుతున్నా వినరు. ఇలా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను చెబుతున్నా పరిష్కారం కావడం లేదు' అంటూ అధికారుల తీరుపై ఎంఎల్‌ఎలు, మంత్రి పార్థసారథి డిఆర్‌సి (జిల్లా సమీక్షా కమిటీ) సమావేశంలో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో డిఆర్‌సి సమావేశం జరిగింది. సమావేశానికి మంత్రి పార్థసారథి, ఎంఎల్‌ఎలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, సొంగా రోషన్‌కుమార్, కామినేని శ్రీనివాస్, చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి, జిల్లా అధికారులంతా పాల్గొన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, డ్వామా, పరిశ్రమలు, పౌరసరఫరాలశాఖ, ఆర్‌టిసి వంటి శాఖల్లోని సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎలు మాట్లాడుతూ కౌలురైతులకు సొసైటీల్లో ఎరువులు ఇచ్చేటట్లు చూడాలని, యూరియా కావాలంటే ఓటిపి చెప్పాలనే నిబంధన తొలగించాలని తెలిపారు. కోకోనట్ బోర్డు ఉన్నా రైతులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరడం లేదన్నారు. మొక్కజొన్న రైతులకు వ్యాపారులు డబ్బులు ఇవ్వడం లేదని, సీడ్స్ కంపెనీలు నాసిరకం విత్తనాలు ఇచ్చి దెబ్బతీస్తున్నాయన్నారు. 2014–19 మధ్య ఉపాధి హామీలో చేసిన పనులకు కేంద్రం ఇస్తున్న నిధులపై తమకు అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదన్నారు. పరిశ్రమల కోసం తలపెట్టిన ఎంఎస్‌ఎంఇ పార్కులకు సంబంధించి భూముల విషయంలో అధికారులు సరిగా వ్యవహరించడం లేదన్నారు. 'తల్లికి వందనం'లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. ఉచిత బస్సు పథకానికి సంబంధించి అంతరాష్ట్ర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అటవీశాఖ అధికారుల తీరు సరిగా లేదంటూ ఎంఎల్‌ఎలంతా ముక్తకంఠంతో తెలిపారు.

రైతాంగ సమస్యలపై రాజీపడం.. ★★★

నాదెండ్ల మనోహర్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి

అన్నదాత సుఖీభవకు సంబంధించి ఈ నెల 20వ తేదీలోపు సమస్యలు ఉంటే పరిష్కరించాలని, యూరియా కొరతలేకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని, రైతాంగ సమస్యలపై రాజీ పడేది లేదని ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. డిఆర్‌సి సమావేశం అనంతరం మనోహర్ మీడియాతో మాట్లాడారు. ఉద్యాన సాగులో ఐదోస్థానం నుంచి మూడోస్థానంకు వచ్చేందుకు కృషి జరుగుతుందన్నారు. కోకోనట్ బోర్డు రైతులకు ఉపయోడపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. సోలార్ పవర్‌ను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. జిల్లాకు 8,550 కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయని, దీంతో కార్డుల సంఖ్య 6,18,864కు చేరిందని, మొత్తం 17,43,274 సభ్యులు ఉన్నారని తెలిపారు. అంత్యోదయ కార్డులు 34,838 ఉన్నాయని, అవసరమైన వారికి కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీపం పథకంలో పెండింగ్ అర్జీలు పరిష్కరించాలని అధికారులకు తెలిపామన్నారు. ఉచిత బస్సు ప్రయాణంలో మూడు రోజుల్లో 71,664 మహిళలు ప్రయాణించారని తెలిపారు. వరదలకు సంబంధించి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. మంత్రి పార్థసారథి పలు విషయాలపై సూచనలు చేశారని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అటవీశాఖకు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇప్పటి వరకూ ఒక ఎంఎస్‌ఎంఇ పార్క్ సిద్ధమైందని, మరో మూడు చివరిదశలో ఉన్నాయన్నారు.

ఆర్‌ఎఫ్‌ఒ పట్టాలిచ్చి సాగునీరివ్వకపోతే ఎలా.. ★★★

కొలుసు పార్థసారథి, మంత్రి

అటవీశాఖ వ్యవసాయం చేసుకునేందుకు ఆర్‌ఎఫ్‌ఒ పట్టాలిచ్చి బోర్లు వేసుకునేందుకు అనుమతి ఇవ్వకపోతే రైతులు సాగు ఎలా చేస్తారు. అడవుల్లో ప్లాంటేషన్ చేయడం లేదు. అక్రమ మైనింగ్‌పై జరిమానా విధించినా చర్యలు లేవు. రెవెన్యూ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూజివీడు రింగ్‌రోడ్డు భూముల సేకరణలో ధర విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరించడం తగదు.

14 నెలలైనా ఒక్క ఇల్లూ కట్టలేదు. ★★★

చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎంఎల్‌ఎ

అధికారంలోకి వచ్చి 14 నెలలైంది. ఇప్పటి వరకూ ఒక్క ఇల్లూ కట్టలేదు. జనం నుంచి తీవ్ర ఒత్తిడి వస్తుంది. వెంటనే సమస్యను పరిష్కరించాలి. మొక్కజొన్న సీడ్స్ అందించే కంపెనీలు నేరుగా రైతులకు అగ్రిమెంట్లు రాసేవిధంగా చర్యలు తీసుకోవాలి. కోకోనట్ బోర్డు రైతులకు ఉపయోగపడేలా చర్యలు ఉండాలి.

సత్యసాయి తాగునీటి సమస్యను పరిష్కరించండి ★★★

చిర్రి బాలరాజు, పోలవరం ఎంఎల్‌ఎ

మూడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న సత్యసాయి తాగునీటి సమస్యను పరిష్కరించండి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొక్కజొన్న వ్యాపారులు రైతులకు డబ్బులు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. నియోజకవర్గంలో 50 మందికిపైగా బాధిత రైతులు ఉన్నారు.

ఉచిత బస్సుకు రాష్ట్ర సరిహద్దు సమస్యలను పరిష్కరించాలి.. ★★★

సొంగా రోషన్‌కుమార్, చింతలపూడి ఎంఎల్‌ఎ

రాష్ట్ర సరిహద్దులు చూపుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనుమతించడం లేదు. సమస్యను పరిష్కరించాలి. పెండింగ్ ఉపాధి హామీ నిధులు త్వరగా విడుదల చేయాలి.

కొల్లేరులో రోడ్డు వేయాలి.. ★★★

కామినేని శ్రీనివాస్, కైకలూరు ఎంఎల్‌ఎ

కొల్లేరులో రోడ్డు వేయకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుపడుతున్నారు. మానవతా కోణంలో ఆలోచించాలి. ఫారెస్ట్ అధికారులు సమావేశాలకు రావడం లేదు. కొల్లేరు వరదతో ఇబ్బంది లేకుండా పెద్దఎడ్లగాడి వద్ద పేరుకుపోయిన తూడును తీసి సమస్యను పరిష్కరించాలి.

విలీన గ్రామాలకు సంబంధించి ఉపాధి నిధులపై సమాచారం లేదు.. ★★★

బడేటి చంటి, ఏలూరు ఎంఎల్‌ఎ

2014–19 మధ్య చేసిన ఉపాధి హామీ పనుల నిధులు ఇస్తున్నారు. కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాలకు అప్పట్లో చేసిన ఉపాధి పనుల నిధుల గురించి అధికారులు కనీస సమాచారం ఇవ్వడం లేదు.

నారాయణపురం వంతెన నిర్మాణం అత్యంత అవసరం.. ★★★

పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎంఎల్‌ఎ

నారాయణపురం వంతెన రెండు జిల్లాలను కలుపుతోంది. ఈ వంతెన నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. ఆక్వా రైతుల నుంచి గతంలో వాడుకున్న విద్యుత్తుకు ఇప్పుడు బిల్లులు అంటూ కట్టిస్తున్నారు. దీనిపై రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొల్లేరులో డ్రెయిన్లు తవ్వకపోవడంతో సమస్య ఉంది.

కొనసాగుతున్న గోదావరి వరద ఉధృతి



వేలేరుపాడు: ఎద్దువాగు పొంగడంతో పడవపై రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

ఓపక్క వర్షం.. మరోపక్క వరద ఉధృతితో మండలంలోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. సోమవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి 37 అడుగులు దాటి ప్రవహిస్తుండటంతో మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో లోతట్టు గిరిజన గ్రామాల ప్రజలు గుండెల్లో భయానక వాతావరణం నెలకొంది. గోదావరి వరద అంతకంతకూ పెరిగి సుమారు 40 నుంచి 45 అడుగుల మేర ప్రవహిస్తుందని లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. గతంలో వచ్చిన వరదల సమయంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను దష్టిలో పెట్టుకుని లోతట్టు ప్రాంతాల ప్రజలు మెరక ప్రాంతాలకు తమ సామగ్రిని గత నెలలో గోదావరి వరదలకు మునుపే తరలించారు. మిరప నారుమళ్లు, పత్తి వేసిన రైతులు కురుస్తున్న వర్షాలకు నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎద్దు వాగు కాజ్‌వే నీట మునిగి 20 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే మార్గంలో ఎద్దువాగు కాజ్‌వే మునిగిపోవడంతో సిద్ధారం, టేకూరు, ఎడవల్లి, కోయిదా, కట్కూరు తదితర సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

కుక్కునూరు రూరల్: ఐదు రోజులుగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతోపాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదలడంతో మూడు రోజులుగా గోదావరికి వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే మూడు రోజులుగా కుక్కునూరు–దాచారం మధ్య గుండేటి వాగుకాజ్వే ముంపులోనే ఉంది. దీంతో 12 గిరిజన గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే 15 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి రావాల్సి వస్తోంది.

కొల్లేరులోకి భారీగా వరద నీరు

ముంపు బారిన పొలాలు - తూడు తొలగింపు పనులు చేపట్టిన అధికారులు



మండవల్లి: పెద్దఎడ్లగాడి వద్ద తూడు తొలగింపు



భీమడోలు: మునిగిన వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ప్రజాశక్తి - మండవల్లి

ఎగువ ప్రాంతాల్లోని వరదనీరు భారీ స్థాయిలో కొల్లేరులోకి వచ్చి చేరుతుంది. పెద్దఎడ్లగాడి–పెనుమాకలంక రహదారిపై నుండి వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఇక పెద్దఎడ్లగాడి వంతెన వద్ద పేరుకుపోయిన తూడును పొక్లెయిన్‌తో తొలగించే పనులను తహశీల్దార్ సోమవారం ప్రారంభించారు. తూడుతొలగిస్తే కొంత ముంపు సమస్య తొలగుతుందని భావిస్తున్నారు. భారీస్థాయిలో వరద నీరు వస్తుండటంతో కొల్లేటి లంక గ్రామాల ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రంగంలోకి దిగేందుకు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాన్ని అందుబాటులో ఉంచారు. తూడు తొలగింపు పనులను కైకలూరు రూరల్ సిఐ రవికుమార్, మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు పరిశీలించారు.


భీమడోలు: కొల్లేరు వరద నీరు వెనక్కి ఎగదన్నడంతో మండల పరిధిలో కొల్లేరులోని ఆదివారమే నీట మునిగిన సంగతి తెలిసిందే. సోమవారం సాయంత్రానికి కొల్లేరును ఆనుకుని భీమడోలు, గుండుగొలను, పూళ్ల ప్రాంతాల్లో సుమారు 520 ఎకరాల విస్తీర్ణంలో వరి పొలాలు ముంపునకు గురైనట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. ఎగువ నుంచి వచ్చే వరద నీటికి తోడు, స్థానికంగా రెండు రోజులుగా పెద్దఎత్తున వర్షాలు కురుస్తుండటంతో ముంపు మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పొలాల్లోని పైరు కుళ్లిపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఇదే విషయాన్ని సోమవారం తమ ప్రాంత సందర్శనకు వచ్చిన వ్యవసాయాధికారి ఉషారాణి దృష్టికి రైతులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముంపు నుంచి బయటపడే వరకూ నష్టం అంచనా వేసే అవకాశం లేదన్నారు.

తెలుగు ప్రజల ఆత్మ గౌరవం ఎన్‌టిఆర్

విగ్రహావిష్కరణలో నేతలు

ప్రజాశక్తి - లింగపాలెం (చింతలపూడి)


తెలుగు ప్రజల ఆత్మ గౌరవం, సినీ కళామ్మతల్లి కీర్తి కిరీటం, విశ్వవిఖ్యాత నటనా చాతుర్యం అన్నీ కలిసిన ఏకైక రూపం 'ఎన్‌టిఆర్' అని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పీతల సుజాత, చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. నియోజకవర్గంలోని లింగపాలెం మండలం అన్నపనేనివారిగూడెం గ్రామంలో సోమవారం కీర్తిశేషులు నటరత్న, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్ మాట్లాడుతూ సినిమాల నుంచి రాజకీయాల వరకూ తనదైన ముద్రవేసి, దశాబ్దాలుగా తెలుగు ప్రజల ప్రేమని పొందుతున్న మహనీయుడు 'నందమూరి తారకరామారావు' అన్నారు. తెలుగు వాడి పౌరుషానికి ప్రతీకగా కనిపించే ఎన్‌టిఆర్ కీర్తి ఎల్లలు లేనిదని తెలిపారు. రాజకీయ రంగంలో కూడా పెను తుఫాను సృష్టిస్తూ ఎన్నో మార్పులు తీసుకొచ్చారన్నారు. ఆడవారికి ఆస్తి హక్కుల దగ్గర నుండి రెండు రూపాయలకు కిలో బియ్యం వరకూ ఎన్నో గొప్ప కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారి సత్తా చూపించారన్నారు. విగ్రహ దాత బొలినేని సత్యనారాయణ ఎన్‌టిఆర్ విగ్రహం ఏర్పాటు చేయటం అభినందనీయమని తెలిపారు. అన్నపనేనివారిగూడెం ఎప్పుడు గుర్తుపెట్టుకుంటానని, వారి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని, త్వరలోనే రోడ్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాల్లో ఎన్‌టిఆర్ చరిత్ర అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ, చింతలపూడి మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళి, జగ్గవరపు ముత్తారెడ్డి, యువ నాయకుడు కిరణ్, గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ, తదితరులు

సిపిఎం మండల కార్యదర్శి శివనాగరాజు ఆకస్మిక మృతి

నాగరాజు మృతి పార్టీకి తీరని లోటు
సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి



జోహార్లు అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు(57) సోమవారం తెల్లవారుజామున అనారోగ్య సమస్యతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె కలరు. నాగరాజు భౌతికకాయాన్ని మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెం సుందరయ్య నగర్‌లోని ఆయన స్వగృహంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎన్‌విడి.ప్రసాద్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, కె.లింగరాజు, సిపిఎం నాయకులు జహాంగీర్ భాషా, కోటేశ్వరరావు, పాపారావు, హనుమాన్లు, శోభనాచలం, చంటి, నరేష్, రవీంద్ర, అయ్యప్ప, శామ్యూల్, రామకృష్ణ, కెవికె.ప్రసాద్, పలు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు సందర్శించి, ఎర్రజెండాను కప్పి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ చాకిరి శివనాగరాజు మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని, నాగరాజు గత 19 సంవత్సరాలుగా సిపిఎం పిలుపులో భాగంగా పలు ప్రజా ఉద్యమాల్లో అంకితభావంతో పనిచేస్తూ, ఆగ్జలరీ సభ్యుడి నుంచి నేడు మండల కార్యదర్శి వరకు ఎదిగి, మండల పరిధిలోని పలు ప్రజా ఉద్యమాల్లో పాల్గొనటం జరిగిందన్నారు. ప్రస్తుతం చిన్నాగిరిపల్లిలో ఆక్రమణకు గురైనా దళితుల భూముల కోసం జరుగుతున్న భూపోరాటంలో ఆయన కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. నాగరాజు కుటుంబాన్ని సిపిఎం అన్ని విధాలుగా ఆదుకొంటుందన్నారు.

సంక్షోభం వైపు.. ఆక్వా సాగు

- కలవరపెడుతున్న సుంకం
- సందిగ్ధంలో పడిన సాగు రైతులు
- అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం



రొయ్యలు పట్టుబడి చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - కాళ్ల

ఓపక్క ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు అమెరికా సుంకాల దాడితో ఆక్వా సాగు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఇటు రైతులతోపాటు అటు వ్యాపారులు సైతం ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటి వరకూ సీడ్, ఫీడ్ ధరలు పెరగడం, మరోపక్క ప్రకృతి వైపరీత్యాలు, విద్యుత్ భారాలు వంటి సమస్యలతో ఆక్వా రైతులు సతమతమయ్యారు. ఆ సమస్యలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాకపోయినా సీడ్, ఫీడ్ ధరలు కొంత తగ్గడంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ భారాలపై ఏం చేయాలా అని మదన పడుతుండగానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల భారం విధించడంతో ఒక్కసారిగా రొయ్యల ధరలు కుదేలయ్యాయి. దీంతో అటు వ్యాపారులు, ఇటు రైతులు సైతం నష్టపోయే ప్రమాదం ఏర్పడింది.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రొయ్యల సాగు చాలా విస్తృతంగా ఉంది. రాష్ట్రంలో ఆక్వా (రొయ్యలు, చేపల) చెరువులు 5.75 లక్షల ఎకరాల్లో ఉండగా, అందులో 2.63 లక్షల ఎకరాలు ఈ జిల్లాలోనే ఉన్నాయి. ఈ జిల్లాలో 60 శాతం విస్తీర్ణంలో సుమారు మూడు లక్షల టన్నుల రొయ్యలు ప్రతి సంవత్సరం ఉత్పత్తి అవుతున్నాయి. రూ.18 వేల కోట్లు వార్షిక టర్నోవర్ సాగుతోంది. ఎగుమతులు సైతం అమెరికాకే ఎక్కువ కావడం గమనార్హం. ఇప్పటికే 25 శాతం సుంకం అమల్లోకి రాగా, ఈ నెల 27 నుంచి మరో 25 శాతం అమలులోకి రానుంది.

భారీగా పడిపోయిన ధరలు

అమెరికా టారిఫ్ ప్రభావం ఏటా రూ.20 వేల కోట్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతులు చేసే ఆక్వా రంగంపై పడింది. సుంకాల భారం ప్రకటించగానే ఎగుమతిదారులు రొయ్యల ధరలను భారీగా తగ్గించేశారు. 25 కౌంట్ రొయ్య ధర కిలో రూ.565 నుంచి రూ.430కు తగ్గింది. మిగిలిన కౌంట్ల ధరలు సైతం కిలోకు రూ.35 నుంచి రూ.80 మేర తగ్గాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ) యాంటీ బయోటిక్ ఆరోగ్య ప్రమాణాలను కఠినతరం చేసింది. దీనివల్ల మందులు ఎక్కువ వాడిన రొయ్యలను తిరస్కరించే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు, ట్రేడర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ రాయితీ కల్పించాలి

గతంలో అసైన్డ్ భూముల్లో సాగు చేసే రొయ్యల చెరువులకు కూడా విద్యుత్ సబ్సిడీ ఇచ్చేవారు. అయితే గత వైసిపి ప్రభుత్వం రాయితీని ఎత్తివేసింది. దీంతో రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఉన్న భూములనే ఆక్వా జోన్ పరిధిలోకి తెచ్చి అసైన్డ్ భూములను మినహాయించింది. ఆక్వా జోన్‌లో ఉన్నప్పటికీ ఒక్కో రైతుకు 10 ఎకరాల వరకే విద్యుత్ రాయితీని ఇస్తామని గత ప్రభుత్వం మెలికపెట్టింది. ఇటీవల కూటమి ప్రభుత్వం ఆక్వా రంగాన్ని పరిశ్రమగా గుర్తించింది. మేత ధరలు తగ్గించింది. రూ.1.50కే యూనిట్ విద్యుత్ సరఫరా చేస్తోంది. ఆక్వా జోన్‌ను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటోంది. కేంద్రం కూడా రాయితీలు కల్పిస్తే అమెరికా విధించిన టారిఫ్ నుంచి గట్టెక్కే అవకాశం ఉందని అటు వ్యాపారులు, ఇటు రైతులు ఆశిస్తున్నారు.

20కిపైగా ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అనేక ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. ముఖ్యంగా భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు వంటి ప్రాంతాల్లో ఈ యూనిట్లు కేంద్రీకృతమై ఉన్నాయి. జిల్లాలో 20కిపైగా ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, 10కి పైగా ఆక్వా ఫీడ్ మిక్స్ యూనిట్లు ఉన్నాయి. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు జిల్లాలో ముఖ్యంగా భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలో 20కిపైగా ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. ఇవి చిన్న, మధ్య , పెద్ద తరహా పరిశ్రమలుగా ఉన్నాయి. సుమారు 80 వేల మంది వరకూ కార్మికులు పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆక్వా ప్రాసెసింగ్ పరిశ్రమ జిల్లా ఆర్థిక వ్యవస్థకు ఒక ముఖ్యమైన భాగం. ఇది ఎగుమతులు, స్థానిక వినియోగం రెండింటికీ దోహదం చేస్తోంది. వ్యాపారులు రొయ్యలను కొనుగోలు చేసిన తర్వాత కోల్డ్ స్టోరేజీల తీసుకొచ్చి వాటిని ప్రాసెస్ చేసి, భద్రపర్చి అనంతరం విదేశాలకు ఎగుమతి చేస్తారు. అయితే చెరువుల నుంచి నేరుగా వచ్చిన రొయ్యల తలలను తొలగించి, శుభ్రం చేసేందుకు పెద్దసంఖ్యలో కార్మికులు అవసరం. రొయ్య వలుపు కార్మికులు సుమారు 50 వేల మంది పని చేస్తున్నారు.

సుంకాల భారాన్ని కేంద్రం భరించాలి..


మంతెన పెదనరసింహమూర్తిరాజు, ఆక్వా రైతు, కలవపూడి



సుంకాల భారాన్ని కేంద్రప్రభుత్వం భరించాలి. సుంకాల పెంపుదలను తీవ్రంగా ఖండిస్తున్నాం. పన్ను పెంచితే అమెరికాలో ధరలు పెరుగుతాయి. ఆ ప్రభావం అక్కడి వినియోగదారులపై పడుతుంది. కొన్ని దేశాలకు ఒకరకంగా, మరికొన్ని దేశాలకు మరొక రకంగా పన్ను విధించడం సరికాదు. పన్ను వల్ల గందరగోళ పరిస్థితి ఏర్పడింది. బయ్యర్లు ఎగుమతులు ఆపేయాలని చెప్పారు. కంటైనర్లు ఆగిపోయాయి. మిత్ర దేశం అంటూనే ఈవిధంగా చేయడం సరికాదు. ప్రధాని నరేంద్రమోడీ చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం చూపించే ప్రయత్నం చేయాలి. రైతులు, వ్యాపారులు ఇతర దేశాలకు రొయ్యలు ఎగుమతి చేసే విషయంపై దృష్టి పెట్టాలి.

ప్రతి ఒక్కరికీ సంక్షేమం, అభివృద్ధి ఫలాలు

మంత్రి కొలుసు పార్థసారథి



రక్షిత తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రతి ఇంటికీ, ప్రతి ఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు చేరాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో సుమారు రూ.83.14 లక్షల నిధులతో మంజూరైన గ్రామ సచివాలయం, జలజీవన్ మిషన్ కింద మంజూరైన రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని, రైతు సేవా కేంద్రాన్ని, సీసీ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆగిరిపల్లి పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలుతో పేద, మధ్యతరగతి ప్రజల్లో వెలుగులు నింపుతున్నామని, స్త్రీ శక్తి పథకంతో మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకం, పేదరికాన్ని పారద్రోలటానికి పి4 పథకం, దీపం పథకం కింద మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను అందజేయడం, మంచానికి పరితమైన రోగులకు నెలకు రూ.15 వేల ఫించన్ అందజేయడం వంటి కార్యక్రమాలతో రైతులు, మహిళలు, పేదల మోముల్లో చిరునవ్వులు చిందించటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వం 2014–2019 మధ్య కాలంలో ఉద్దేశ్యపూర్వకంగా నిలుపదల చేసిన ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ బిల్లులను కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు, చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు చేయవలసిందిగా మంత్రి కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సిబ్బందిని ఆదేశించారు. చిరు వ్యాపారుల రుణాలకు తాను హామీగా వుంటానని మంత్రి అన్నారు. కార్యక్రమంలో ఆగిరిపల్లి గ్రామ సర్పంచి సిహెచ్.లక్ష్మీ విక్టర్‌బాబు, మండల పార్టీ అధ్యక్షులు ఎన్.వేణు, ఆగిరిపల్లి టౌన్ పార్టీ అధ్యక్షులు పి.నరశింహారావు, నాయకులు ఏసుపాదం, ఎ.శ్రీనివాసరావు, శ్రావణ్, సత్యకుమార్, ప్రణీత్, పలు గ్రామాల సర్పంచిలు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి విలేకరి అర్జున్‌రావుకు మాతృవియోగం



ప్రజాశక్తి – బుట్టాయగూడెం

పోలవరం మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామానికి చెందిన ప్రజాశక్తి పోలవరం విలేకరి పీతల అర్జున్‌రావు తల్లి పీతల సూరమ్మ(68) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఇంటి వద్దే తుది శ్వాస విడిచారు. ఆమెకు ఇద్దరు సంతానం. సూరమ్మ అంత్యక్రియలు సోమవారం సాయంత్రం నిర్వహించారు. సూరమ్మ మృతి పట్ల ప్రజాశక్తి జిల్లా మేనేజర్ పి.నారాయణరాజు, డెస్క్‌ఇన్‌ఛార్జి వివిఎస్ఎన్.ప్రసాద్, స్టాఫ్‌రిపోర్టర్ పి.గంగరాజు, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి వై.సీతారాం, డివిజన్ ఇన్‌ఛార్జి జి.మాణిక్యాలరావు సంతాపం తెలిపారు. అర్జున్‌రావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం తెలిపారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

ముసునూరు : మండల పరిధిలోని మర్రిబంధం గ్రామానికి చెందిన పి.శ్రీనివాసరావు సేవా హృదయంతో మద్దాయిగుంట మోడల్ ప్రైమరీ పాఠశాలకు రూ.15 వేలు విలువచేసే బీరువాను బహూకరించారు. పాఠశాలలో వసతులు లేవని గ్రహించిన స్థానిక టిడిపి నాయకులు తిరుమలరెడ్డి నాగరాజు ద్వారా ఈ బీరువాను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా మోడల్ ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ తొమ్మండ్రు యువరాజు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు పాఠశాలకు ఆర్థిక సహకారం అందించినందుకు గాను బీరువా బహూకరించిన శ్రీనివాసరావుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ హెచ్‌ఎం తొమ్మండ్రు యువరాజు మాట్లాడుతూ గ్రామ నాయకులు, శ్రేయోభిలాషులు నిస్వార్థ సేవాభావంతో పాఠశాల అభివృద్ధికి చేయూత అందించడం మరువలేమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి వి.లక్ష్మి, ఎంపిటిసి పి.కళావతి, టిడిపి గ్రామ నాయకులు టి.నాగరాజు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఆరిమిల్లి పద్మాకర్ రావు, జనసేన నాయకులు ఆనంద్, గ్రామ పెద్దలు రమేష్, ఉపాధ్యాయులు పి.నాగేంద్ర రావు, కె.నవ్య, డానియేల్, ఎ.అనురాధ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

భీమడోలు : వాహనదారులు తాము ప్రయాణించే సమయంలో వేగము కన్నా తమతో పాటు ఎదుటివారి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పూళ్ల గ్రామపంచాయతీ సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, కార్యదర్శి సునంద కోరారు. గ్రామపంచాయతీ పరిధిలోని మల్లీశ్వరం ఆవాస ప్రాంతంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని పూళ్లకు చెందిన పోలీస్ సిబ్బంది కెఎల్.లక్ష్మీ సుజన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పివిబిడి ప్రసాద్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా లక్ష్మీ సుజన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి : ఎంఇఒలు

మండవల్లి : ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు మరింత కృషిచేయాలని ఎంఇఒ 1, 2 సురేష్, రత్నసునాదయ్య స్పష్టం చేశారు. మండలంలోని అయ్యవారి రుద్రవరం హరిజనవాడలోని ఎంపిపి పాఠశాలను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో ఇటీవల నిర్వహించిన ఎఫ్ఎ 1 పరీక్షకు సంబంధించిన అసెస్మెంట్ బుక్లెట్స్‌ను తరగతుల వారీగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చే క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పించాలని అన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని రుచికరంగా వండి వడ్డించాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరిగిరి పిచ్చేశ్వరరావు, ఉపాధ్యాయులు జయశ్రీ పాల్గొన్నారు.

నీట మునిగిన పొలాల పరిశీలన

ఉంగుటూరు : రావులపర్రు, వి.పురం, దొంతవరం, కాకర్లమూడి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, తహశీల్దార్ వై.పూర్ణ చంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నీట మునిగిన వరి పొలాలను సోమవారం పరిశీలించారు. వరి పొలాలన్నీ కూడా 20 నుండి 30 రోజుల కాలపరిమితిలో ఉన్నాయి. ఈనెల 13వ తేదీ నుండి కురుస్తున్న వర్షాలకు రంగాపురం కోడు, పెద కోడు, చింత కోడు, లింగంకోడు, ఆక్మి కోడు కారణంగా వరి పొలాలు ముంపుకు గురవడం ముఖ్య కారణంగా రైతులు పేర్కొన్నారు. ముంపు పొలాల తేరుకోవడానికి వర్షాలు తగ్గిన తరువాత వరి పొలాలలోని నీటిని బయటకు తీసివేసి బూస్టర్ డోసేజ్‌గా ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ను వేసుకోవాలని, తరువాత ముందు చర్యగా కార్బెండజిమ్ తెగులు మందును 1 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఏరువాక కేంద్రం, ఏలూరు సమన్వయ కర్త డాక్టర్ కె.ఫణి కుమార్, శాస్త్రవేత్త (విస్తరణ) ఎన్.నాగేంద్ర బాబు, మార్టేరు శాస్త్రవేత్తలు డాక్టర్ పి.వి.రమణా రావు (ప్లాంట్ బ్రీడింగ్), డాక్టర్ ఎ.ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

పలు సమస్యలపై గ్రామస్తుల ఫిర్యాదు

ఉంగుటూరు : రావులపర్రులో పంచాయతీ చెరువు నీరు సక్రమంగా ఫిల్టర్ కావడం లేదని బురద, మురికి నీటితో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. 5 నెలల క్రితం మండల పరిషత్ నిధులు రూ.3.50 వేలతో స్థానిక గుత్తేదారుడు ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులు చేయించినా పనిలో నాణ్యత లేని కారణంగా సమస్య తలెత్తిందని తెలిపారు. పనులు నాసిరకం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే తాగునీటి సమస్య వచ్చిందని, అధికారులు పరిష్కారం చూపాలని గ్రామస్తులు యడవల్లి కృష్ణమూర్తి ఫిర్యాదు చేశారు. కాగా అదే గ్రామంలో పంచాయతీ రోడ్డును ఆక్రమించి షెడ్డు నిర్మించడం వల్ల జనాలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని ఇబ్బ పూజారి నరసింహులు ఫిర్యాదు చేశారు. డ్రైయినేజీ స్థలాన్ని ఆక్రమించడం వల్ల మురుగునీరు కదలడం లేదని ఆక్రమ నిర్మాణాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ రాజ్‌మనోహర్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కాగా మరమ్మతులు చేసిన ఫిల్టర్ బెడ్లు పూర్తి స్థాయిలో పనిచేయడం లేదని ఉంగుటూరు నుంచి సిపిడబ్ల్యు పథకం నీటిని వదులుతున్నామని, వాటిని ట్యాంకు ద్వారా గ్రామస్తులకు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యుఎస్ జాని చెప్పారు.

పురుగుమందు దుకాణాల తనిఖీ

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని లక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్‌ను మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని రికార్డులను తనిఖీ చేసి కాంప్లెక్స్ ఫెర్టిలైజర్ 12 టన్నుల స్టాకు రికార్డులకు సరిపోకపోవటంతో తాత్కాలికంగా నిలిపివేయమని తెలిపారు. ఈ పోస్ మిషన్ ద్వారానే ఎరువులను విక్రయించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు స్టాకు సక్రమంగా ఉండాలన్నారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే 6ఎ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండలంలో రైతులకు యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. సొసైటీలలో 18.50 టన్నుల యూరియా, ప్రైవేట్ డీలర్స్ వద్ద 25 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.

ఓటర్ లిస్టులో అవకతవకలపై నిరసన

ఏలూరు సిటీ : ఎలక్షన్ కమిషన్ ఓటర్ లిస్టులో చేసిన అవకతవకలకు నిరసనగా సోమవారం కాంగ్రెస్ కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఓటర్ లిస్ట్‌లో చేసిన అవకతవకలు నిరసనగా లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పిలుపుమేరకు ఓట్ల దొంగలు గద్దె దిగాలి అనే నినాదంతో కొవ్వొత్తుల నిరసన ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని నడిరోడ్డులో పాతరేసారని, రాజ్యాంగాన్ని ప్రజాహక్కులను కాపాడుకోవాలని ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉన్నమట్ల ఎలిజ, దెందులూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఆలపాటి నరసింహమూర్తి, నూజివీడు ఇన్‌ఛార్జి మరీదు కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తల్లి పిల్లలు అదృశ్యం

ముదినేపల్లి : తల్లి తన పిల్లలతో అదృశ్యమైన సంఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని శ్రీహరిపురం గ్రామానికి చెందిన నసక రవీంద్ర తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలం నుంచి భార్య భర్తల మధ్య మనస్పర్ధల కారణంతో తరచూ రవీంద్ర భార్య లక్ష్మి శిరీష పిల్లలను తీసుకుని తన పుట్టింటి కలిదిండి మండలం కొరుకొల్లు వెళ్లి. ఈ క్రమంలో భార్య రవీంద్ర వద్దకు వచ్చి ఇంటి వద్దే ఉంటుంది. ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో భర్తకు చెప్పకుండా భార్య తన ఇద్దరు బిడ్డలు కుమారుడు నాగ సాయి(12), గీతా ప్రత్యూష(7)లను తీసుకొని వెళ్ళిపోయింది. రవీంద్ర చుట్టుపక్కల వెతికిన ఆచూకీ తెలియ రాలేదు. దీంతో అత్త మామకు తెలియ పరచగా తమ వద్దకు రాలేదన్నారు. దీంతో రవీంద్ర తన భార్య, బిడ్డలు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కరేడులో పోలీసుల నిర్బంధం తగదు

సిపిఎం జిల్లా కమిటీ ఖండన

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

నెల్లూరు జిల్లా కారేడులో ఇండోసోల్ కంపెనీకి బలవంతంగా వేలాది ఎకరాల రైతుల భూములను కట్టబెట్టే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజా సంఘాలు ఇచ్చిన చలో కారేడు పిలుపుపై పోలీసుల నిర్బంధం ప్రయోగించడాన్ని, అక్రమంగా అరెస్టులు చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిర్వహించ తలపెట్టిన సభకు వెళ్తున్న సిపిఎం, రైతు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేయడం అన్యాయమన్నారు. అరెస్ట్ అయిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి.వెంకటేశ్వర్లు, దడాల సుబ్బారావు, నెల్లూరు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, ప్రకాశం జిల్లా సిపిఎం కార్యదర్శి ఎస్‌కె.మాబు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, ఇతర సిపిఎం నాయకులు ఉన్నారని తెలిపారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి అనుమతులు లేవని, 30వ సెక్షన్, 144 సెక్షన్ ప్రకటించి ప్రధాన రహదారులను పోలీసులు నిర్బంధించడం అన్యాయమన్నారు. నిరసన వ్యక్తం చేసేందుకు కారేడు గ్రామం వెళ్తున్న ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు సుమారు 100 మందిని అరెస్టు చేశారని తెలిపారు. అయినా పోలీస్ నిర్బంధాన్ని ఎదుర్కొని, అరెస్టులకు భయపడకుండా కారేడు గ్రామంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సభ జరపడం ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలపై పోలీసు నిర్బంధాన్ని ఆపాలని, ప్రభుత్వం తన మొండి వైఖరిని విడనాడి ఇండోసోల్ కంపెనీకి భూములు కేటాయింపు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



పాదును తొలగిస్తున్న సిబ్బంది

వీధి దీపం చుట్టూ పాదు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన


జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ధారావారి వీధిలో ఉన్న రాజా హాస్పిటల్ వద్ద వీధి దీపం చుట్టూ పాదు పేరుకుపోయింది. దీంతో రాత్రి అయితే వీధి దీపం వెలుగుతున్నా వెలుతురు రావడం లేదని ప్రజాశక్తిలో సోమవారం 'అలుముకున్న నిర్లక్ష్యం' శీర్షికన వెలువడిన వార్తకు అధికారులు స్పందించారు. ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారు వెంటనే వీధి దీపం గుండా ఉన్న పాదును తొలగించారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కెమికల్ ట్యాంకర్ సేఫ్..

ప్రమాదమేమీ లేకుండా రెండు గంటలపాటు శ్రమించి బయటకు తీయించిన పోలీసులు

జీలుగుమిల్లి : మండలంలోని రమనక్కపేట సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం కెమికల్ ట్యాంకర్ బోల్తా కొట్టిన సంఘటన విధితమే. అయితే ట్యాంకర్‌లో రసాయనం లీక్ అవుతుండటంతో ప్రమాదమేమీ జరగకుండా రాత్రి నుంచి పహరా కాస్తున్న పోలీసులు ఎట్టకేలకు సోమవారం ఉదయం రెండు జెసిబిలు, రెండు క్రైన్‌ల సహాయంతో రెండు గంటలపాటు శ్రమించి ప్రమాదమేమి జరగకుండా బయటకు తీయించినట్లు ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపారు. అయితే ట్యాంకర్‌ను బయటకు తీసే క్రమంలో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో మరలా ట్రాఫిక్‌ను క్లియర్ చేయించినట్లు ఎస్ఐ తెలిపారు. ట్యాంకర్ బయటకు తీసే క్రమంలో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ

దెందులూరు : సొంత ఊరు ప్రజల కోసం కోట్లాది రూపాయలను విరాళంగా అందించడం సంతోషాదాయకమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఒక మంచి సంకల్పంతో ప్రపంచ స్థాయి గుర్తింపు కలిగిన ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ వారి ఆధ్వర్యాన 2026/27 నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ నేత్ర సంరక్షణ కేంద్రం నిర్మాణానికి అన్ని విధాల అండగా ఉంటామని ఎంఎల్ఎ వెల్లడించారు. నియోజకవర్గంలోని పెదవేగి మండలం వంగూరు గ్రామంలో ప్రఖ్యాత ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో నేత్ర సంరక్షణా కేంద్రానికి సోమవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. నేత్ర సంరక్షణా కేంద్రానికి దాదాపు రూ.10 కోట్ల భూమిని, రూ.2 కోట్ల నగదును మాజీ ఐఎఎస్ అధికారులు కాసరనేని రాజు, దమయంతి దంపతులు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ప్రభాకర్ మాట్లాడుతూ నూతన నేత్ర సంరక్షణ కేంద్రానికి కాసరనేని గోపాలకృష్ణయ్య ప్రాంగణం – కాసరనేని పరిపూర్ణ లక్ష్మి నేత్ర సంరక్షణా కేంద్రంగా పిలవబడుతుందన్నారు. ఐ కేర్ సెంటర్‌కు అప్రోచ్ రోడ్డు కోసం భూమిని విరాళంగా ఇచ్చిన కాసరనేని సాగర్‌ని, ఆసుపత్రి నిర్మాణానికి రూ.కోట్ల విరాళం అందించిన వాణి శ్రీరామ్‌ని, రూ.కోటి విరాళం ప్రకటించిన రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావుకి, మరో కోటి విరాళం ప్రకటించిన రామారావు సహా నిర్మాణానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్న దాతలను అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మాజీ మంత్రి, మాజీ ఎంపీ జేడీ శీలం, జార్ఖండ్ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి కె.రాజు, ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య, తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, విజయవాడ తూర్పు ఎంఎల్ఎ గద్దె రామ్మోహన్, కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్, ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దోమల దండయాత్ర

అధికారుల నిర్లక్ష్యం.. ప్రమాదంలో ప్రజారోగ్యం

ప్రజాశక్తి – కుక్కునూరు


మండలంలో విపరీతమైన దోమలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సీజన్‌లో దోమల సమస్య మరింత తీవ్రమైంది. సాయంత్రం అవ్వగానే దోమలు ప్రజలపై దాడి చేస్తూ, రక్తాన్ని పీల్చి విష జ్వరాలు, నిద్రలేమి వంటి సమస్యలను కలిగిస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో దోమల ఉధృతి మరింత పెరిగింది. మండలంలోని గ్రామాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జ్వర బాధితుల సంఖ్య పెరుగుతుండగా, విద్యుత్ కోతలు మరింత ఇబ్బందులను తెచ్చిపెడుతున్నాయి. అయితే అధికారులు దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆందోళనకరం. దోమ తెరల పంపిణీ, బ్లీచింగ్ పౌడర్ వాడకం, పరిశుభ్రత కార్యక్రమాలు, మందుల పిచికారీ వంటి అవసరమైన చర్యలు తక్షణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు అందుబాటులో ఉంటా..

సొసైటీ ఛైర్మన్ దేవినేని శ్రీధర్

ప్రజాశక్తి – ముసునూరు


రైతులకు అందుబాటులో ఉంటూ రుణాలు సకాలంలో మంజూరు చేసేలా చర్యలు చేపడతానని సొసైటీ ఛైర్మన్ దేవినేని శ్రీధర్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ముసునూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్ దేవినేని శ్రీధర్, సభ్యులు గోగం కాటమరాజు, చీలి లక్ష్మిలు సొసైటీ కార్యదర్శి దాసిరెడ్డి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యాన ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు అందించే రుణాలతో పాటు రసాయనిక ఎరువులు, అలాగే పలు సబ్సిడీల ద్వారా రైతులకు వచ్చే అన్ని రాయితీలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తూ, అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి బాబి, బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్క యోహాన్, ఉప సర్పంచి తోట శ్రీను, దేవినేని ప్రసాద్, చలసాని కుటుంబరావు, తులిమెలి రంగారావు, తుమ్మల లక్ష్మణరావు, సూర్యదేవర శ్రీనివాసరావు, రాపర్ల బాలకృష్ణ, మల్లిబాబు పాల్గొన్నారు.



శ్రీధర్‌ను అభినందిస్తున్న టిడిపి నేతలు

రైతులకు రుణాలు సకాలంలో అందిస్తా

సొసైటీ ఛైర్‌పర్సన్ పొట్లూరి అనురాధ



అనురాధను అభినందిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి – ముసునూరు

రైతులకు లభించే అన్ని సదుపాయాలు సొసైటీ ద్వారా అందిస్తానని సొసైటీ ఛైర్‌పర్సన్ పొట్లూరి అనురాధ అన్నారు. సోమవారం మండలంలోని కొర్లకుంట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్ పొట్లూరి అనురాధ, సభ్యులు ఎస్.సూర్యనారాయణ, అలుగుల సుమలత సొసైటీ కార్యదర్శి పార్వతి ఆధ్వర్యాన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్‌పర్సన్ అనురాధ మాట్లాడుతూ రైతులకు సొసైటీ ద్వారా వచ్చే రుణాలు, సబ్సిడీలు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆదేశాల మేరకు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు, టిడిపి నాయకులు కొల్లి గంగారం, పండరీనాథ్, మందలపు ధర్మరాజు, బ్యాంకు మేనేజర్ తలారి వెంకటరంగా ప్రసాద్, బ్యాంక్ సూపర్‌వైజర్ రామారావు, రైతులు పాల్గొన్నారు.

సొసైటీని బాధ్యతాయుతంగా నడిపించాలి

ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్

ప్రజాశక్తి – చింతలపూడి



మాట్లాడుతున్న ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

సొసైటీని బాధ్యతగా ముందుకు నడిపించాలని, రైతులకు సకాలంలో రుణాలు ఇప్పించాలని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. మండలంలోని రాఘవాపురం పిఎసిఎస్ ఛైర్మన్‌గా మాటూరి వెంకటరామయ్య ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఛైర్మన్, సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించి వారిని అభినందించారు. కార్యక్రమంలో రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.సత్యనారాయణ

ప్రజాశక్తి – నూజివీడు టౌన్



వర్షాల నేపథ్యంలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు సంభవించినప్పుడు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నూజివీడు ఎపిఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.సత్యనారాయణ సోమవారం పలు సూచనలు చేశారు. వర్షపు వేళ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు, ఎలక్ట్రికల్ తీగలు, ఇతర పరికరాల దగ్గర గుమ్మి కూడ వద్దన్నారు. తడిచేతులతో ఎలక్ట్రిక్ స్విచ్ ఆన్, ఆఫ్ చేయకూడదన్నారు. వర్షపు నీటితో నిండిన ప్రదేశాలలో, పొలాల్లో, రోడ్లలో ఉన్న ఎలక్ట్రిక్ లైన్ల దగ్గర తిరగవద్దని తెలిపారు. విద్యుత్ తీగలు, స్తంభాల దగ్గర గుడారాలు, షెడ్లు, టెంట్లు వెయ్యకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. మరీ ముఖ్యంగా పిల్లలు ఎలక్ట్రిక్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర ఆడకూడదన్నారు. విద్యుత్ ప్రమాదాలను ముందుగా గుర్తించి అధికారులకు తెలియజేయాలన్నారు. విద్యుత్ హెవీ లైన్స్, ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఇతర విద్యుత్ పరికరాల వద్ద ప్రమాదాలను గుర్తిస్తే తక్షణమే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. ఇది ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

మల్లుకుంట సొసైటీ ఛైర్మన్‌గా సాయి వినయ్ బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న శీలం సాయి వినయ్

టి.నరసాపురం : మండలంలోని మల్లుకుంట సొసైటీ ఛైర్మన్‌గా టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తనయుడు శీలం సాయి వినయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మల్లుకుంట సొసైటీ ఛైర్మన్‌గా శీలం సాయి వినయ్, సభ్యులుగా వెదుళ్ల వెంకటేశ్వరరావు, తలారి ఆంధ్రా బాబు సోమవారం కూటమి నాయకులతో కలసి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా సాయి వినయ్ మాట్లాడుతూ సహకార సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, తోట లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షుడు పేరుబోయిన శ్రీనివాసరావు, గండబోయిన శ్రీను, వెంకట్రావు, సంఘ సిఇఒ కిలారు సత్యనారాయణ పాల్గొన్నారు.


గుణ్ణంపల్లి సొసైటీ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం



సుధాకర్ రావును అభినందిస్తున్న జనసేన నేతలు

ద్వారకాతిరుమల : మండలంలోని గుణ్ణంపల్లి సహకార సంఘం ఛైర్మన్‌గా జనసేనకు చెందిన అక్కిసేటి సుధాకర్ రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీరికి జనసేన తరపున జనసేన గోపాలపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి సువర్ణ రాజు, జనసేన మండల నాయకులు, నియోజకవర్గ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సువర్ణ రాజు మాట్లాడుతూ రైతులకు కావలసిన అన్ని అవసరాలు తీర్చే విధంగా సొసైటీ కమిటీలు కృషి చేయాలని సూచించారు.

గుండుగొలనుకుంట సొసైటీ ఛైర్మన్ బాధ్యతల స్వీకరణ




రామచంద్ర శేఖర్‌కి ఫొటోను బహుకరిస్తున్న నేతలు

ద్వారకాతిరుమల : మండలంలోని గుండుగొలనుకుంట సొసైటీ ఛైర్మన్ గా జనసేనకి చెందిన అద్దంకి రామచంద్ర శేఖర్ బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా పేరాం రజనీ, అబ్బూరి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల సొసైటీ ఛైర్మన్ పోలిన శ్రీనివాసరావు, గోపాలపురం నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి దొడ్డిగార్ల సువర్ణ రాజు, మాజీ ఎంపిపి ఏపూరిదాలయ్య, జి.కొత్తపల్లి సొసైటీ ఛైర్మన్ రేగంటి రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు పాకలపాటి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణానికి రూ.వంద కోట్ల సేకరణే లక్ష్యం

అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి

ముదినేపల్లి : కలల రాజధాని అమరావతి అభివృద్ధికి ఏడాదిలో రూ.వంద కోట్ల విరాళాలు సేకరించడం లక్ష్యంగా మొదలు పెట్టిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని అమరావతి బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి అన్నారు. ముదినేపల్లిలో ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తనపై నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబు తనను రెండోసారి అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించడం సంతోషమన్నారు. తాను ఎవరిని అడిగినా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ఇలా ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నామని చెబుతున్నారని, విజయవాడలో ఉద్యోగం చేస్తున్నామని అన్నవారు లేరని తెలిపారు. ఆ ఆవేదనలో నుంచి పుట్టిన ఆలోచనే అమరావతి అభివృద్ధిలో యువతను భాగస్వాములను చేయాలనే ఉద్దేశ్యం నుంచి 'రూ.116 సాయం' ఆలోచన పుట్టిందన్నారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకువెళ్లానన్నారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ, కమిషనర్ కన్న బాబు అంగీకరించి వీటిలో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. గతంలో అమరావతి నిర్మాణానికి ఒక్కో ఇటుక విరాళం అందించడానికి తెరచిన సిఆర్‌డిఎ బ్యాంకు ఖాతా నంబర్నే ఇప్పుడు విరాళాల సేకరణకు వినియోగిస్తున్నామన్నారు. రాష్ట్ర యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మన రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రూ.116 విరాళాన్ని సిఆర్‌డిఎ ఖాతాలో జమ చేస్తారని ఆశిస్తున్నామన్నారు. రాజధాని అమరావతి నిర్మాణంలో పాలు పంచుకోవాలని వైష్ణవి విజ్ఞప్తి చేశారు.



అంబుల వైష్ణవి

కొత్త బార్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి – నూజివీడు టౌన్

నూజివీడు పట్టణానికి నాలుగు బార్లను మంజూరు చేసినట్లు ఎక్సైజ్ సిఐ మస్తానయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మద్యం వ్యాపారులతో తన కార్యాలయంలో సమావేశం నిర్వహించి కొత్త బార్ పాలసీని తెలిపారు. ఈ బార్లకు దరఖాస్తుదారులు నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు రూ.5 లక్షలను, ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలను చలానా రూపంలో ఆన్‌లైన్‌లో గాని, ఆఫ్‌లైన్‌లోగాని చెల్లించాలని అన్నారు. ఒక్కొక్క బార్‌కు లైసెన్స్ ఫీజు 2025–2026 సంవత్సరానికి గాను రూ.55 లక్షలు, 2026–2027 సంవత్సరానికి రూ.60 లక్షల 50 వేలు, 2027–2028 సంవత్సరానికి రూ.68 లక్షల 50 వేలు ప్రభుత్వం లైసెన్స్ ఫీజుగా నిర్ణయించిందని తెలిపారు. ఈ బార్లకు దరఖాస్తులను లాటరీ పద్ధతిలో తీయబడునని అన్నారు. తమ దరఖాస్తులను ఏలూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తులు ఈనెల 18వ తేదీ నుండి 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరిస్తారని తెలిపారు.

ఏలూరు అర్బన్ : జిల్లా వ్యాప్తంగా 18 బార్లకు సోమవారం జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 11, నూజివీడు మున్సిపాలిటీలో నాలుగు, జంగారెడ్డిగూడెం నగర పంచాయతీలో రెండు, చింతలపూడి నగర పంచాయతీలో ఒకటి చొప్పున మొత్తం 18 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న బార్లకు ఈనెల ఆఖరితో లైసెన్స్ ముగిసిపోతుందని, కొత్త లైసెన్సులు సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి 2028 ఆగస్టు 31వ తేదీ వరకు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 18 బార్లకు ఈనెల 18వ తేదీ 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణమునకు మొత్తం రెండు బార్లను మంజూరు చేయడం జరిగింది. ఈ బార్లకు దరఖాస్తుదారులు నాన్ రెఫండబుల్ అప్లికేషన్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్ ద్వారా గాని ఆఫ్‌లైన్ ద్వారా గాని దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తులను లాటరీ పద్ధతిలో డ్రా తీయబడుతుందని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనుబాబు తెలిపారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను ఏలూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈనెల 18 నుంచి 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

పాత్రికేయునికి ఎంఎల్ఎ ఆర్థిక సాయం

జీలుగుమిల్లి : గత కొన్ని సంవత్సరాలుగా పాత్రికేయ వృత్తిలో పని చేస్తూ అనారోగ్యానికి గురై విజయవాడలోని ఓ ప్రయివేటు ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న పాత్రికేయుడు కె.ప్రసాద్‌ను పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఫోన్‌లో పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలు తెలుసుకొని ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం తన వంతుగా రూ.20 వేల నగదును అందించారు. అదే విధంగా మండలంలోని రాచన్న గూడెం గ్రామానికి చెందిన మడివి రాజేశ్వరమ్మ కి చెందిన తాటకిళ్లు గత కొన్ని నెలల క్రితం దగ్ధమై నిరాశ్రయులై కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు ఎంఎల్ఎ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. త్వరలో ఇంటి నిర్మాణానికి కూడా కృషి చేస్తానని తెలిపారు.

ఘనంగా పాపన్న గౌడ్ జయంతి

ప్రజాశక్తి – ముదినేపల్లి

ప్రజలంతా మహోన్నతుల అడుగుజాడల్లో నడవాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా సోమవారం మండల వైసిపి ఆధ్వర్యాన సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆయన సేవలు కొనియాడారు. పెడన ఎంపిపి అచ్యుత రావు, ఈడే వెంకటేశ్వరావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ పాల్గొన్నారు.